# ఒంటరి చెట్టు

**- యం. ఐ. కిషన్**

''హవ్వ!''

అవ్వ తన చప్పిడి బుగ్గల్ని కుడిచేత్తో మరికాస్త లోపలికి నొక్కుకుంది. ''ఏంటి నాయనా ఆ తప్పుడు మాటలు? నన్ను చూస్తుంటే తెలీడంలా?!'' అంది రాంబాబు కేసి కోపంగా చూస్తూ.

తానన్నదాన్లో అంత ఘోరమైన తప్పేముందో అర్థంకాలేదు రాంబాబుకి.

ఏమన్నాడు తను? 'అవ్వా తాతయ్యగారున్నారా?' అనడిగాడు. అంతేగా?

అలా అనుకుంటుంటే సడెన్‌గా అతని మెదళ్లోని బల్బు వెలిగింది.

అవ్వ 'అలా' అపార్థం చేస్కుందన్నమాట!



విషయం అర్థమైపోవడంతో ''ఛఛ... నా ఉద్దేశం అది కాదవ్వా! తాతయ్యగారింట్లో వున్నారా అనడుగుతున్నానంతే'' అన్నాడు అవ్వ కళ్లలోకి 'సారీ' అన్నట్టుగా చూస్తూ.

రూపాయి కాసంత కుంకుమబొట్టు అవ్వ నుదుట అంత స్పష్టంగా కన్పిస్తుంటే తాతయ్యగారు అసలీ లోకంలోనే లేరేమో ననుకోడానికి తనకేమన్నా పిచ్చా? అవ్వే తొందరపడి అనవసరంగా అలా అపార్థం చేసుకుందంతే!

విల్లులా వొంగిపోయిన నడుం. ముగ్గుబుట్టలా పండిపోయిన జుట్టు. క్రేప్‌సిల్క్ గుడ్డలా ముడతలు పడిపోయిన చర్మం. వడిలిపోయిన తోటకూర కాడలా వేళ్లాడిపో తోన్న శరీరం. ఊతకోసం చేతబుచ్చుకున్న కర్ర... చెప్పకనే చెబుతున్నాయ్ ఆమె వయసు ఎనభై పైమాటేనని. అవ్వకే ఇంత వయసుంటే తాతయ్యగారికి ఇంకెంతుం డాలి?

అవ్వ తన ప్రశ్ననలా అపార్థం చేస్కోడం సబబే అనిపించింది రాంబాబుకి ఆమె నంత పరిశీలనగా చూశాక.

అతని ఎక్స్‌ప్లనేషన్‌కి అవ్వ శాంతించినట్టుంది. ఆమె ముఖంలోని కోపం మటుమా యమైపోయింది.

''తొందరపాటు నాదేలే నాయనా'' అంది బిడియంగా తల దించుకుంటూ. ''ఆయన ఇంట్లోనే వున్నారు'' అంది ఏదో నములుతున్న దానికిమల్లే చప్పిడి దవడలా డిస్తూ.

''ఒకసారిలా పిలుస్తావా?'' అన్నాడు రాంబాబు.

''పిలిచినా ఆయన రారులేగానీ, ఇంతకీ నువ్వెవరు నాయనా?'' అనడిగింది అవ్వ.

'పాపం ముసలాయన మంచాన్న పడ్డాడన్నమాట. అందుకే పిలిచినా రాలేరులే అంటోందవ్వ' మనసులో అనుకుని... తానే పనిమీదొచ్చిందీ చెప్పాడు రాంబాబు.

''ఓల్డేజీ పెన్షనా? ఆయన కాలూ చెయ్యీ తిన్నగా వున్నంతవరకూ మాకు ప్రభుత్వ సాయమే కాదు; ఇంకెవరి సాయమూ అక్కర్లేదులే నాయనా'' అంది అవ్వ.

అంటే ముసలాయనింకా మంచాన్న పడలేదన్నమాట! ఇప్పటిక్కూడా ఇంకా పని చేసి సంపాదించగలిగే స్థితిలోనే వున్నాడన్నమాట?!! బాప్‌రే బాప్!!

ఇప్పటివాళ్లు యాభై దాటితే చాలు; గుండెపోటో... మరోహటో, మరోహటో వచ్చి పుటుక్కున టపా కట్టేస్తున్నారు.

అలాంటిది తాతయ్యగారింకా హెల్దీగానే వున్నారూ అంటే... ఏమైనా ఆ తరం వాళ్ల ఆరోగ్యమే ఆరోగ్యం!

మరి... 'పిలిచినా రాలేరులే' అంటోందేంటి అవ్వ?! కొంపదీసి విని కిడి శక్తిగాని తగ్గిపోయిందా?!!

ఆ మాటే అడిగాడు రాంబాబు అవ్వని.

అందుకు జవాబుగా, ''ఎందుకు వినిపించదు నాయనా? బాగానే వినిపిస్తుంది. ఆయనకేం రాయిలా వున్నారు'' అంది అవ్వ.

''మరి పిలిచినా రాకపోవడం ఏంటి?!''

''అంతేలే నాయనా. కుర్చీ వేసుకుని ఆ కిటికీ పక్కన చేరేరూ అంటే ఇంక ఒంటి మీద స్పృహే వుండదాయనకి. ఉందిలే మా పక్కింట్లో ఓ తిప్పులాడి. ఆ కిటికీ పక్కన కూర్చుంటే వాళ్ల పెరడంతా కళ్లకు కట్టినట్టు కనబడుతూంటుంది. ఆ మహాతల్లె ప్పుడూ పెరట్లోనే ఛస్తుందాయె! ఈనగారక్కడ కూర్చుని దానికేసి గుడ్లప్పగించి చూస్తుంటారు. ఏం చెప్పమంటావులే నా బాధ? నేనా ముసలి డొక్కునైపోయా



నాయె!'' అవ్వ ఊతకర్ర నొదిలేసి మరీ చేతులు తిప్పుతూ అలా అంటుంటే రాంబాబుకి మతిపోయినట్టే అనిపించింది.

ఈ వయసులో అవ్వకి తాతయ్యగారి మీద అనుమానమా?

హవ్వ! ఎంత ఘోరం?!!

ఎంత ముసలాళ్లైనా ఈ ఆడాళ్లలో ఇలాంటి అనుమానాలు పోవన్నమాట?!!

లోలోన ఆశ్చర్యపోతూ ''ఛఛ! అలా అయ్యుండదులే అవ్వా! ఏదో చల్లగాలి కోసం తాతయ్యగారక్కడ కూర్చుంటారేమోలే'' అన్నాడు రాంబాబు, ముక్కూ మొహం తెలీకపోయినా తాతయ్యగార్నే వెనకేసుకొస్తూ. రాంబాబు భార్య రామలక్ష్మికూడా భర్త మీద చాలా అనుమానం. ''దానికేసి అలా ఎందుకు చూశారు? దీనికేసి ఇలా ఎందుకు చూశారు?'' అంటూ అనుమానంతో అతన్ని తెగ సాధిస్తూంటుందెప్పుడూ.

అది గుర్తొచ్చే అతనలా తాతయ్యగార్ని సపోర్ట్ చేశాడు.

''ఆయన బుద్ధి నీకు తెలుసా నాకు తెలుసా నాయనా? చల్లగాలి కోసం కాదు. ఇంట్లో వున్నంతసేపూ ఆయనక్కడి నుంచి కదలకపోడం దాని ఒంపు సొంపులు చూసి మురిసిపోడానికే. దానికి మొగుడుపోయి మూడేళ్లయిందిలే. ఈ మూడేళ్లనుంచీ ఇదే వరస. ఇవతల నేనొకదాన్నున్నాను కాబట్టి నాకు జడిసి ఊరుకుంటున్నారే తప్ప లేకపోతే ఈపాటికి దాన్నెప్పుడో సెకెండ్ సెటప్ చేసేసేవారే!'' బోసినోరు కావటం వల్ల మాటల్లో స్పష్టత లోపించినా భాషమాత్రం చాలా స్వచ్ఛంగా వుంది అవ్వది.

చూడబోతే చదువుకున్న దానికిమల్లే వుంది.

''అవ్వా! నువ్వెంతవరకు చదువుకున్నావ్?'' అడిగాడు రాంబాబు.

''ఎఫ్.ఏ'' చెప్పింది అవ్వ.

ఆరోజుల్లో ఎఫ్.ఏ అంటే మాటలా? అందునా ఒక ఆడమనిషి అంత చదువు చదవటం అంటే ఆరోజుల్లో నిజంగా అది చాలా విశేషమే!

ఇంత లేటు వయసులో కూడా అవ్వ తాతయ్యగార్ని అంత ఘాటుగా అనుమానిస్తోందీ అంటే బహుశా ముసలాయన చాలా రసికుడే అయ్యుండాలి. ఒకానొకప్పుడు 'గ్రంథసాంగుడే' అయ్యుండాలి...

''ఈ వయసులో కూడా నువ్వాయన్ను అనుమానిస్తున్నావంటే 'ఆ విషయం'లో ఆయన ఉద్దండుడన్నమాట?! అంతేనా అవ్వా?!'' పండు వృద్ధురాలే గనుక, ఏమనుకోబోతుంది లెమ్మని సూటిగా అడిగేశాడు రాంబాబు.

అవ్వ బోసినోటితో బిడియంగా నవ్వింది. ''కాబట్టే కద నాయనా, జీవితంలో అసలు పెళ్లే వద్దనుకున్న నేను- ముప్పై ఎనిమిదేళ్ల వయసులో అప్పట్లో ఆ పదిహేడేళ్ల కుర్రకుంకకి లొంగిపోయింది? ఆయనకి భార్యనై కూర్చుంది?!!''

అవనత శిరస్కయై అవ్వ అలా అంటుంటే రాంబాబు ఆశ్చర్యపోయాడు.

''అంటే తాతయ్యగారు నీకన్నా ఇరవయ్యొక్కేళ్లు చిన్నవారా అవ్వా?!!''

''లెక్క ప్రకారమైతే అంతే. కానీ చూడ్డానికింకా చిన్నవారిలా కనిపిస్తారు. చూడాలనుకుంటే లోపలికెళ్లు నాయన ఫర్లేదు'' అంది అవ్వ.

కుతూహలం రాంబాబుని వెంటనే ఆ ఇంటి అరుగు మీంచి ముందరి గదిలోకి నడిపించింది.

'అవ్వ భర్త' నిజంగానే ఆ గదిలో ఓ కిటికీ దగ్గర కూర్చుని అవతలికి చూస్తున్నాడు.

కిటికీ కావల పెరట్లో తీగె మీద బట్టలారేస్తూ ఓ నలభయ్యేళ్ల స్త్రీ. గాలిగుమ్మటంలా నిండుగా బొద్దుగా వుంది. ఎత్తుగా వున్న తీగె మీద ఆమె చేతులు పైకెత్తి బట్టలారేస్తూ వుంటే ఆమె పయ్యెద స్థానభ్రంశం చెంది బిగి సడలని ఆమె ఎద పొంగులు బహిర్గతమవుతూ వున్నాయ్. అయితే అవ్వ భర్త ఆమె ఒంపు సొంపుల్ని చూసి మురిసిపోతున్నట్టుగా అనిపించలేదు రాంబాబుకి. అసలాయన చూపులు ఆ స్త్రీ మీద వుంటే కదా? పక్కింటి పెరట్లో వున్న ఓ కొబ్బరి చెట్టుకేసి తదేక దీక్షగా చూస్తూ వున్నాడాయన.

అక్కడక్కడా తెల్లబడినా ముప్పాతిక భాగం ఇంకా నల్లగానే వున్న జుట్టు. దృఢమైన శరీరం. ముదిమి ఛాయలు ముఖంలో కానవస్తూనే వున్నా... నలభై రెండేళ్ల రాంబాబు 'తాతయ్యగారూ' అని పిలవదగ్గ వయసు మాత్రం కాదాయనది.


వాళ్లకంటూ పిల్లలుండుంటే బహుశా మనవలూ మనవరాళ్లూ కూడా వుండుండేవాళ్లు. వాళ్లాయన్ని 'తాతయ్యగారూ' అని పిలిచుండేవాళ్లే. కానీ తమకు పిల్లల్లేరని అవ్వ అంతకు ముందే చెప్పిందాయె!

రాంబాబు ఓ పొడి దగ్గు దగ్గడంతోనే ఆయన చటుక్కున తల తిప్పి అతనికేసి చూశాడు.

''నమస్తే సార్! నా పేరు రాంబాబు'' అంటూ ఆయన్ని సమీపించి-

ఆ పక్కనే వున్న ఓ స్టూల్ మీద కూర్చుని, తానొచ్చిన పని వివరించాడు రాంబాబు.

## అనిల్ జోస్యం



నేనేం సినిమాలు చేస్తే ఆ సబ్జక్టులు రెండేళ్ళ తర్వాత మిగతా హీరోలు చేస్తారు అన్నాడీమధ్య అనిల్‌కపూర్. ఈవిషయం కనుక తెలిస్తే సంజయ్‌దత్, అమీర్‌ఖాన్, సనీడియోల్, గోవిందా, జాకీష్రాఫ్‌లు హాయిగా నిట్టూరుస్తారు. ఎందుకంటే అనిల్ మాట ప్రకారం రెండేళ్ళ వరకు వీళ్ళెవరికీ ఫ్లాప్‌ల భయం ఉండదుకదా.

## నీనా జల్సా

పెళ్ళికాకుండానే తల్లయి సంచలనం కల్గించిన నీనాగుప్తా, కన్నకూతుర్ని ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఆ పసిపాపని అలా వదిలేసి తాజా ప్రియుడితో విందులు, విలాసాలు అంటూ గడుపుతోంది. కన్నకూతుర్ని ఆమె మానాన ఆమెను వదిలేసి ఇష్టం వచ్చినట్లు తిరిగే తల్లి నీనాగుప్తాయేట.

- డి.సత్యమూర్తి

ఆయన్ను తాతయ్యగారూ అనేందుకు నోరు రాలేదు అతనికి. అవ్వ అన్నట్టే అన్నాడాయన కూడా.

"మాకా అవసరం లేదబ్బాయ్! ఇంతో అంతో ఆస్తుంది. ఇప్పటిక్కూడా ఎంతో కొంత సంపాదించుకోగల శక్తుంది. నా భార్యని చూశాక నీ లిస్ట్‌లో ఆమె పేరు రాయాలని నీకనిపించిందేమో బహుశా! కానీ నీ ఓల్డేజ్ పెన్షన్‌తో ఆమెకు పనేంటి? ఆమెకి నేనున్నాను. దాన్నింకెవర్రికైనా అవసరంలో వున్నవారికిస్తే సద్వినియోగమవుతుంది..."

"సరే అలాగే..." అంటూ తలాడించి, "మీరేం అనుకోనంటే నాదో చిన్న సందేహం" అన్నాడు రాంబాబు ఒకింత సంకోచంగానే.

"ఊ ..." చెప్పమన్నట్టుగా చూశారాయన.

"మీకూ అవ్వకీ... సారీ మీ మిసెస్‌కీ ఇంత వయోబేధం?" మాట పూర్తిచెయ్యలేకపోయాడు రాంబాబు.

"ఏం- వుండకూడదా?" అంటూ నవ్వేసి- తిరిగి కంటిన్యూ చేశాడాయన. "ఒకప్పుడు మా స్వరాజ్యలక్ష్మి దగ్గర నేను స్టూడెంట్‌ని. పరీక్షల సమయంలో రాత్రుళ్లు చదువుకోడానికని నేనూ మరో నలుగురు స్టూడెంట్సూ అప్పట్లో మా 'టీచర్'గారింటికి వెళ్తుండేవాళ్లం. దుడుకు స్వభావం, తెలిసీ తెలీనితనంలో ఉరకలేసే కోరిక... ఒకరోజు నాతో తప్పు చేయిస్తే- తొలిసారిగా అనుభవంలో కొచ్చిన 'మగస్పర్శ' ఆ తప్పునామె ఒప్పుకునేలా చేశాయి. జరక్కూడనిదే జరిగిపోయాక, ఆ తప్పుని సరిదిద్దుకోడానికి మాకు పెళ్లొక్కటే సరైన మార్గంగా తోచింది. అందుకే ఎవరెన్ని విధాలుగా అడ్డుకున్నా అందర్నీ కాదనుకొని మరీ ఇద్దరం ఒక్కటయ్యాం. ఆ తప్పుని ఒప్పుగా మలుచుకున్నాం. ఈజ్ దేర్ ఎనీ థింగ్ రాంగ్?"

"లేదు సార్" అన్నాడు రాంబాబు సిన్సియర్‌గా .

"మా నలభయ్యారేళ్ల వైవాహిక జీవితంలో తప్పు చేశామేమోనన్న ఫీలింగ్ మా ఇద్దర్లో ఏ ఒక్కరికీ ఏనాడూ కలగలేదు. మాకు పిల్లలు పుట్టకపోయినా, ఒకరికొకరంగా ఇన్నాళ్లూ ఎంతో అన్యోన్యంగా బ్రతికాం. ఇకమీదటా అలాగే బ్రతుకుతాం. కానైతే పేరుకి నేను 'తాతయ్య'నే అయినా చూపులకి మాత్రం తాను నిజంగానే అవ్వైపోయిందిగా? అందుకనే ఇప్పుడిప్పుడే చిన్న ప్రోబ్లం స్టార్టయ్యింది. 'అవ్వగారి'కి ఈ 'తాతయ్య' మీద చిన్న అనుమానం- అఫ్‌కోర్స్ ఇంకా పెనుభూతమైతే కాలేదనుకో" అంటూ నవ్వేశాడాయన.

"అయితే మీ పేరే తాతయ్యగారా సార్?" అడిగాడు రాంబాబు.

"గారు లేదు. ఉత్త తాతయ్యే" అంటూ మరోసారి నవ్వేశాడాయన. అంతలో అవ్వ రెండు గ్లాసుల్లో చల్లటి మజ్జిగ తెచ్చి అందించింది వాళ్లిద్దరికీ.

అది కాస్త కడుపులో పడ్డాక, 'భలే విచిత్రమైన జంట' అని మనసులో అనుకుని, వారి వద్ద సెలవు తీసుకుని మరో ఇంటికేసి సాగిపోయాడు రాంబాబు.

● ● ●

ఓ ఆర్నెల్ల తర్వాత-

ఓల్డేజ్ పెన్షనర్స్ సర్వే పూర్తయినప్పటికీ ఇంకేదో పని మీద రాంబాబా గ్రామానికి మళ్లీ వెళ్లాల్సొచ్చింది.

వచ్చిన పని పూర్తయ్యాక ఒకసారి 'తాతయ్య'గార్ని అవ్వనీ చూడాలనిపించి వాళ్లింటికేసి దారితీశాడు.

రాంబాబు వెళ్లేసరికి అవ్వ ఇంట్లో లేదు.

తాతయ్యగారు కిటికీ దగ్గర కూర్చొని పక్కింటి పెరట్లోని కొబ్బరి చెట్టుకేసి చూస్తున్నారు.

"తాతయ్యగారూ! అవ్వ లేదా?!"

రాంబాబు ప్రశ్నకి ఉలిక్కిపడి ఆయన వెనుదిరిగి చూశాడు.

"ఎవరూ?" అన్నాడు రాంబాబుని చప్పున పోల్చుకోలేక.

"నేను సార్ రాంబాబుని. ఓల్డేజ్ పెన్షన్స్ లిస్ట్ తయారుచేస్తూ ఒకసారి మీ ఇంటికొచ్చాను. గుర్తొచ్చానా?"

అతనలా గుర్తుచేశాక "ఓ నువ్వా అబ్బాయ్? రా" అన్నాడాయన రాంబాబుని గుర్తుపట్టి.

క్రితంసారొచ్చినప్పుడు రాంబాబే స్టూల్ మీద కూర్చున్నాడో అదే స్టూలిప్పుడు కూడా అదే ప్లేస్‌లో వుంటే రాంబాబు వెళ్లి దానిమీద కూర్చున్నాడు.

తాతయ్యగారు కిటికీలోంచి కొబ్బరి చెట్టుకేసి చూస్తూ అన్నాడు. "ఆ కొబ్బరి చెట్టు పక్కనే, మేమీ ఇంట్లో చేరిన మొదట్లో ఇంకో కొబ్బరి చెట్టుండేదబ్బాయ్! అప్పట్లో ఈ చెట్టు చాలా చిన్నది. ఇంకో చెట్టు అప్పటికే చాలా పెద్దది. అందుకే కావచ్చు ఆ చెట్టు ఓ మూడేళ్ల క్రితం ముందుగా చచ్చిపోయింది. చిన్న చెట్టు ఒంటరిగా మిగిలిపోయింది. ఆ ఒంటరి చెట్టుని చూసి నేనెప్పుడూ భయపడుతుండేవాణ్ణి- బాధపడుతుండేవాణ్ణి... వయసులో నాకన్నా పెద్దదైన నా స్వరాజ్యం ఎప్పటికైనా నన్నూ అలా ఒంటరివాణ్ణి చేసి వెళ్లిపోతుందేమోనని. చివరికి నా భయం నిజమే అయ్యింది."

"అంటే... అవ్వ...?"

"అవ్వ లేదు. ఇక రాదు" అన్నాడాయన రెండు చేతుల్లో ముఖం దాచుకుంటూ.

అప్పుడు గమనించాడు రాంబాబు, తాతయ్యగారు గతంతో పోలిస్తే ఇప్పుడెంతగా శుష్కించిపోయారో.

ఆయన ఊపిరి కళ్లలోనే వున్నట్టుగా వుంది.

"అక్కడ మరో పోర్షన్ కట్టించడానికి రేపో మాపో వాళ్లా ఒంటరి చెట్టుని నరికేయబోతున్నారు. ఈ ఒంటరివాడి మీద ఆ భగవంతుడెప్పుడు దయ తలుస్తాడో" అంటూ తాతయ్యగారు కన్నీళ్లు నింపుకుంటుంటే-

"ఊరుకోండి సార్" అనబోయాడు రాంబాబు.

కానీ అప్పటికే అతని కంఠం పూడుకుపోయింది.

★

